# పేదల ఇంటికి అన్నపూర్ణ



- ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సన్నబియ్యం పథకం
- ఏప్రిల్ నుంచి సన్నబియ్యం పంపిణీ
- మెదక్ జిల్లాలో 520 రేషన్ దుకాణాలు.. 2,13,872 కార్డులు
- ప్రతి నెలా 3,626.803 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం

మెదక్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): పేదలకు దొడ్డుబియ్యం బదులు సన్నబియ్యం పంపిణీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తున్నది. సన్న రకాల సాగు ప్రోత్సహించడం, వ్యూహాత్మకంగా రైతులతో నియంత్రిత సాగు చేయిస్తుండడం సన్న బియ్యం పంపిణీ కోసమే. ప్రజా పంపిణీ వ్యవస్థతో ఇప్పటికే పేదలకు రూపాయికి కిలో బియ్యం పథకాన్ని ఉచితంగా అమలు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టోలో పేదలకు రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ చేసేందుకు అన్నపూర్ణ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ పథకం ఏప్రిల్– మే నుంచి సన్నబియ్యం ఇవ్వాలని నిర్ణయించారు. దీంతో మెదక్ జిల్లాలో 2.13 లక్షల కార్డులదారులు లబ్ధిపొందనున్నారు.

**మెదక్ జిల్లాలో 2,13,872 కార్డులు**

మెదక్ జిల్లాలో 520 రేషన్ షాపులున్నాయి. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకం కింద మెదక్ జిల్లాలోని 2,13,872 ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. ఇందులో 13,857 అంత్యోదయ కార్డులు, 1,99,948 ఆహార భద్రత కార్డులున్నాయి. అన్నపూర్ణ కార్డు కలిగి ఉన్న వారు 67 మంది ఉన్నారు. వీరికి ప్రతి నెలా 3,626.803 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా అవుతున్నది. ప్రస్తుత సీజన్‌లో ఉత్పత్తి అయిన ధాన్యం చేతికొచ్చాక, సన్నబియ్యం పథకానికి శ్రీకారం చుట్టనున్నారు. దొడ్డు బియ్యం స్థానంలో సన్నబియ్యం పంపిణీ చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం పెడుతున్నది. ఇందుకు ప్రభుత్వం ఈ–టెండర్లు పిలిచి రైస్‌మిల్లర్ల నుంచి కిలోకు రూ.32.50 చొప్పున వెచ్చించి కొనుగోలు చేస్తున్నది. దొడ్డు బియ్యం ధరతో పోలిస్తే సన్నబియ్యం 23 పైసలు తక్కువ ధరకే లభిస్తున్నాయి.

**ఫోర్టిఫైడ్ రైస్‌తో రక్తహీనతకు చెక్..**

పేదల్లో రక్తహీనతకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. ప్రజా పంపిణీలో భాగంగా వినియోగదారులకు అందిస్తున్న సాధారణ రేషన్ బియ్యానికి బదులు పోషకాలు గల బలవర్ధక బియ్యం (ఫోర్టిఫైడ్ రైస్) పంపిణీ చేస్తున్నది. గురుకులాలు, ప్రభుత్వ హాస్టళ్లు, మధ్యాహ్న భోజన పథకానికీ ఫోర్టిఫైడ్ సన్నబియ్యాన్నే సరఫరా చేస్తున్నది. జిల్లాలోని గురుకులాలు, మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీలకూ సన్నబియ్యాన్నే పంపిణీ చేస్తున్నారు.

**బియ్యం మాఫియా ఆగడాలకు చెక్**

రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీతో బియ్యం మాఫియాకూ చెక్ పెట్టొచ్చని ప్రభుత్వం భావిస్తున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ డిపోల ద్వారా పంపిణీ చేసే బియ్యాన్ని 25 శాతం మంది లబ్ధిదారులు మాత్రమే తింటున్నట్లు గతంలో నిర్వహించిన ఒక సర్వేలో తేలింది. మిగిలిన 75 శాతం పేదల బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నది. రేషన్ షాపులో రూపాయికి కిలో బియ్యం కొంటున్న వినియోగదారుడి నుంచి బియ్యం వ్యాపారులు కిలోకు రూ.10 చొప్పున కొంటున్నారు. ఆపై మధ్య దళారీకి కిలో రూ.15 చొప్పున అమ్ముతున్నారు. వారు రూ.4 లాభం చూసుకుని, ఆ బియ్యాన్ని రైస్ మిల్లర్‌కు రూ.19 చొప్పున విక్రయిస్తున్నారు. ఆ బియ్యాన్ని రైస్ మిల్లులో రీ–సైక్లింగ్ చేసి ప్యాకింగ్ చేస్తే కిలోకు రూ.20.50 పైసల చొప్పున గిట్టుబాటు అవుతున్నది. ఈ నేపథ్యంలో ప్రజలు తినగలిగే బియ్యాన్నే పీడీఎస్ ద్వారా పంపిణీ చేస్తే ఇటువంటి సమస్యలన్నింటికీ పరిష్కారం లభిస్తుందనే ఆలోచనతో సీఎం కేసీఆర్ సన్న బియ్యం పథకానికి శ్రీకారం చుట్టారు.

### సన్నబియ్యం.. మంచి నిర్ణయం



తెల్లరేషన్ కార్డు ఉన్న వారికి సన్నబియ్యం పంపిణీ చేస్తానని సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం చాలా మంచింది. ప్రజలందరి సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ఆలోచిస్తున్నడు. సన్నబియ్యం పంపిణీపై సీఎం చేసిన ప్రకటన ప్రతి ఒక్కరికీ సంతోషాన్నిచ్చింది. ఈ నిర్ణయంతో పేదలు కడుపు నిండా తింటారు.

– రెడ్డిశెట్టి రమాదేవి, తిప్పనగుల్ల, నిజాంపేట

### పేదలకు కడుపు నిండా భోజనం



వ్యాపారాలు, ఉద్యోగాలు చేసే వాళ్లు సన్నబియ్యం తింటరు. అన్ని రకాల పంట పండించే రైతులు దొడ్డు బియ్యం తింటున్నారు. ఇప్పుడు రైతులు కూడా రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం అందించాలనే ఆలోచన చాలా బాగుంది. కూలీ నాలీ చేసుకునే పేదలు కడుపునిండా తింటారు. సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు.

– అరుగు కిష్టయ్య, రైతు, వెల్దుర్తి

### సన్నబియ్యం ఇవ్వడం అదృష్టం



ఉమ్మడి రాష్ట్రంలో రేషన్ బియ్యం కిలోకు రూ.5 చొప్పున ఇస్తుండే. సీఎం కేసీఆర్ వచ్చినంక కిలో బియ్యం రూపాయికే అని చెప్పి ఇప్పుడు ఫ్రీగా ఇస్తున్నడు. మా ఇంట్లో నలుగురం ఉంటాం. మాలాంటి గరీబోళ్లందరికీ సన్నబియ్యం ఇవ్వాలనుకోవడం నిజంగా మా అదృష్టం. మాలాంటి పేదల గురించి ఆలోచించేది సీఎం కేసీఆర్ ఒక్కరే. మూడోసారి ఆయనే సీఎం కావడం పక్కా. సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.

– తీగల లక్ష్మీనర్సయ్య, గూడురు, శివ్వంపేట

### సన్నబియ్యం పేదలకు వరం



బీఆర్‌ఎస్ గెలిస్తే పేదలకు సన్నబియ్యం ఇస్తానని సీఎం కేసీఆర్ ప్రకటించడం సంతోషంగా ఉంది. సన్న బియ్యం కొనుక్కుని తినాలంటే ఇబ్బందిగా ఉంది. రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం ఇవ్వడంతో మాలాంటి పేదోళ్లంతా కడుపునిండా తినగలుగుతాం. రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ చేసే నిర్ణయం తీసుకున్న సీఎం కేసీఆర్‌కు పేదలంతా రుణపడి ఉంటారు. సీఎం సారుకు ధన్యవాదాలు.

– మాసుల రాములు, నర్సాపూర్

### సన్న బియ్యం.. హర్షణీయం



రేషన్ కార్డుపై సన్నబియ్యం ఇస్తామని సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టోలో పెట్టడం హర్షణీయం. ఇప్పటికే స్కూళ్లు, కాలేజీల్లో చదువుకునే పిల్లలకు సన్నబియ్యంతో అన్నం పెడుతున్నారు. మార్కెట్లో సన్నబియ్యం కొని తినలేనంత ధర పెరిగింది. పండుగలప్పుడు సన్నబియ్యం కొనుక్కుంటున్నాం. ఇపుడు నిరు పేదలం కూడా సన్నబియ్యంతో రోజూ అన్నం తినే అవకాశం వచ్చింది. సంతోషం.

– బొల్లి శేఖులు, కొల్చారం

# సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి దీవించండి

**- మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి**



ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాయకులు

మెదక్ అర్బన్, అక్టోబర్18: ప్రజా సంక్షేమానికి దేశంలోని ఏ రాష్ట్రంలోలేని పథకాలను తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం హవేళీఘనపూర్ కాంగ్రెస్, బీజేపీల నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ మండల ఉపాధ్యక్షుడు వడ్ల రాంచందర్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డి, మోహన్, 30 మంది పార్టీలో చేరారు. జడ్పీ వైస్‌చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, మెదక్ 5వ వార్డు కౌన్సిలర్ మామిండ్ల ఆంజనేయులు, హవేళీఘనపూర్ మండల అధ్యక్షుడు అంజాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ జడ్పీటీసీ వినీలానరేశ్

# బీఆర్‌ఎస్‌కు భారీ మెజార్టీ ఖాయం

- రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీర్ హరీశ్‌రావు
- జహీరాబాద్‌లో కాంగ్రెస్‌కు షాక్
- బీఆర్‌ఎస్‌లోకి ఝరాసంగం జడ్పీటీసీ వినీలా నరేశ్

జహీరాబాద్, అక్టోబర్ 18: జహీరాబాద్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీర్ హరీశ్‌రావు తెలిపారు. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఝరాసంగం కాంగ్రెస్ జడ్పీటీసీ వినీలా నరేశ్ బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జహీరాబాద్‌లో ఇప్పటికే బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో అభివృద్ధి చేసిందన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మాణిక్‌రావును గెలిపించుకుందామని, అభివృద్ధి కొనసాగిద్దామన్నారు. అన్ని వర్గాలకు మేలు చేసే మ్యానిఫెస్టో విడుదల చేసిందన్నారు. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో చూసి ప్రతిపక్షాల మైండ్ బ్లాంక్ అయిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థులు దొరకని పరిస్థితి తెలంగాణలో నెలకున్నదన్నారు. వారితో బీఆర్‌ఎస్ ఝరాసంగం మండల అధ్యక్షుడు వెంకటేశం, నాయకులు నామ రవికిరణ్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మాణిక్‌రావు గెలుపు కోసం కృషి చేస్తాం**

జహీరాబాద్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు గెలుపు కోసం కృషి చేస్తామని జడ్పీటీసీ వినీలా నరేశ్ తెలిపారు. బుధవారం జహీరాబాద్ పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ స్థానికేతరులకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి స్థానికులను మోసం చేసిందన్నారు. ఎస్సీ రిజర్వేషన్ ఉన్న స్థానికులకు కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇవ్వడం లేదన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి స్థానికుడు కావడంతో ప్రతిఒకరూ ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎన్నికల ఇన్‌చార్జి దేవీప్రసాద్‌రావు, టీఎస్ఐడీసీ చైర్మన్ తన్వీర్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ పెంటారెడ్డి తదితరులు ఉన్నారు.

# బీఆర్‌ఎస్‌లో చేరిన మైనార్టీ యువకులు



హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్న మైనార్టీ యువకులు

సదాశివపేట, అక్టోబర్ 18: సీఎం కేసీఆర్ నాయకత్వంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. బుధవారం సదాశివపేట మైనార్టీ నాయకులు ఖుద్దూస్, అయూబ్ ఖురేషీ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి చింతా ప్రభాకర్ బీఆర్‌ఎస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యతనిస్తూ తెలంగాణ ప్రభుత్వం గౌరవిస్తున్నదన్నారు. మైనార్టీల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నదన్నారు. రానున్న ఎన్నికల్లో సైనికుల్లా పని చేసి బీఆర్‌ఎస్‌కు అండగా నిలవాలని కోరారు. సంగారెడ్డి ఎమ్మెల్యేగా చింతా ప్రభాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని మైనార్టీ నాయకులు హామీనిచ్చారు. పార్టీలో చేరిన వారిలో సదాశివపేట 15వ వార్డు మైనార్టీ యువకులు ఆవేజీ, వసీం, బిలాల్‌ఖాన్, ఇమాన్, ఖురేషీ, సోహెల్, అపోజీ, సిద్ధిక్, షోయబ్ ఖాన్, జలీల్, ఇలియాజ్, జహంగీర్, ఖాజా తదితరులు ఉన్నారు.

### ఐఐటీలో మెదక్ విద్యార్థి ఆత్మహత్య

చేగుంట: ఐఐటీలో చదువుతున్న మెదక్ జిల్లా విద్యార్థి ఆత్మహత్య చే సుకున్నాడు. చేగుంట మండలంలోని చెట్ల తిమ్మాయిపల్లికి చెందిన అనిత, చందర్‌ల రెండో కుమారుడు కిరణ్ చంద్ర(20) వెస్ట్ బెంగాల్‌లోని ఖరగ్‌పూర్ ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో బిటెక్ మూ డో సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం తాను ఉండే హాస్టల్ గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15–22 వేలు. ఏజెంట్లకు 5000/– కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.
NT-320501

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.